సాక్షి
నంద్యాల

బుధవారం । 7 । ఆగస్టు । 2024



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి మంగళవారం కర్నూలుకు చెందిన భైరెడ్డి సుభాస్ రెడ్డి రూ.1,00,116 విరాళమిచ్చారు.



అన్నదాత ఆశలకు 'గండి'

హంద్రీ-నీవా పథకం ప్రధాన కాలువకు పడిన గండి రైతన్న ఆశలపై నీళ్లు చల్లింది. అధికారులు మంగళవారం గండిని పూడ్చే పనులు చేపట్టి, పంట నష్టంపై అంచనాలు రూపొందించారు. ..8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,632.14
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:102.335
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:84,696
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:55,227

న్యూస్‌రీల్

వ్యవసాయ కళాశాలలో బదిలీలు

మహానంది: మహానంది వ్యవసాయ కళాశాలలో పనిచేస్తున్న సైంటిస్టులు, ప్రొఫెసర్లు పలు ప్రాంతాలకు బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న సైంటిస్ట్ డాక్టర్ కవిత అనంతపురం జిల్లాలోని అగ్రికల్చర్ రీసర్చ్ స్టేషన్‌కు బదిలీ అయ్యారని కార్యాలయ వర్గాలు మంగళవారం తెలిపాయి. డాక్టర్ కవితతో పాటు కళాశాలలో పనిచేస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి నెల్లూరు జిల్లాకు, డాక్టర్ రవికిషోర్ కర్నూ లు జిల్లా ఏరువాక కేంద్రానికి బదిలీ అయ్యా రు. అనంతపురం జిల్లా రీసర్చ్ స్టేషన్‌లో పనిచేస్తున్న డాక్టర్ పవన్‌కుమార్ రెడ్డి, శివజ్యోతి, వైఎస్సార్ జిల్లా నుంచి కృష్ణప్రియలను మహానంది వ్యవసాయ కళాశాలకు బదిలీ చేస్తూ వ్యవసాయ విశ్వ విద్యాలయం ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ అధిరాజ్ సింగ్

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా కేంద్రంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని ప్రథమనంది, సంజీవ్ నగర్ గేట్, నందమూరి నగర్ ప్రాంతాలలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎస్పీతో పాటు ఎస్‌బీ డీఎస్పీ సంతోష్ తదితరులు ఉన్నారు.

దుర్గమ్మ సేవలో కలెక్టర్



రాజకుమారికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

విజయవాడపశ్చిమ: ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా మంగళవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఆమెకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ఈఓ కేఎస్ రామారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.

పాఠశాలల పని వేళల్లో మార్పులు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర వ్యాప్తంగా సీబీఎస్ఈ సిలబస్‌ను అమలు చేస్తున్న నేపథ్యంలో ఆ మేరకు స్కూళ్ల పని వేళలు సవరిస్తూ రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు డీఈఓ సుధాకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈనెల 7వ తేదీ నుంచి రోజూ ఉదయం 9.15 గంటలకు పాఠశాలలు ప్రారంభమై, 9.30 గంటల వరకు ప్రార్థన ఉంటుందన్నారు. అనంతరం మధ్యాహ్నం 12.40 గంటల వరకు నాలుగు తరగతులు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 12.40 నుంచి 1.30 గంటల వరకు లంచ్ బ్రేక్ ఉంటుందన్నారు. అనంతరం సాయంత్రం 4.20 గంటల వరకు తరగతులు కొనసాగుతాయన్నారు.



జల 'కలేనా'!

రైతులకు అండగా నిలవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఆదిలోనే చేతులెత్తుస్తోంది. ఇప్పటికే పెట్టుబడి సాయానికి మంగళం పాడింది. రైతు సంక్షేమానికి గత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల వైపు కన్నెత్తి చూడటం లేదు. మెట్ట ప్రాంత రైతులను ఆదుకునేందుకు అమలైన జలకళ పథకం గురించి ఎక్కడా ప్రస్తావించడం లేదు. ఈ పథకంపై నీలినీడలు కమ్ముకోవడంతో ఎప్పటి నుంచో నిరీక్షిస్తున్న రైతులు ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఉచిత బోర్లు వేసి మెట్టను సస్యశ్యామలం చేయాలని జిల్లా రైతులు కోరుతున్నారు.

- ఉచిత బోర్ల ఊసెత్తని ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ హయాంలో జిల్లాలో 2,146 ఉచిత బోర్లు
- అన్నదాతను పట్టించుకోని కూటమి సర్కార్
- ఖరీఫ్ ప్రారంభమైనా జలకళ ప్రస్తావనే లేదు

కోవెలకుంట్ల: సూపర్ సిక్స్ హామీలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఆ హామీలను ఇప్పటి వరకు పట్టించుకోక పోగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పలు పథకాలను అటకెక్కిస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్ద పీట వేసి రైతు భరోసా పథకం ద్వారా ఏడాది రూ. 13,500 పెట్టుబడి సాయం అందజేసింది. అలాగే ఉచిత ఇన్సూరెన్స్, ప్రకృతి వైపరీత్యాలతో పంటనష్టం సంభవిస్తే పంట నష్ట పరిహారం ఇచ్చి ఆదుకుంది. వీటితో ఆపటు అన్నదాతకు సాగునీటి కష్టాలను తొలగించాలనే లక్ష్యంతో వైఎస్సార్ జలకళ పథకం ప్రవేశ పెట్టి ఉచిత బోర్లను ఏర్పాటు చేసి రైతులను ఆర్థికాభివృద్ధి వైపు అడుగులు వేయించింది. అయితే రైతులను అన్ని విధాలా అదుకుంటామని హామీ ఇచ్చి అధికారం చేపట్టిన టీడీపీ ప్రభుత్వం రెండు నెలలు కావస్తున్నా పట్టించుకోలేదు. ఈ ఏడాది జూన్ నెల 1వ తేదీ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాగా 2.36 లక్షల హెక్టార్లలో పత్తి, మినుము, వరి, మొక్కజొన్న, జొన్న, పెసర, ఆముదం, ఉల్లి, మిరప, తదితర పంటలు సాగు చేయాల్సి ఉంది. వర్షాధారం, కేసీకెనాల్, చెరువులు, బోర్లు, తదితర సాగు నీటి వనరుల ఆధారంగా ఇప్పటి వరకు లక్ష ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఈ సమయంలో రైతులకు రైతు భరోసా పథకం ద్వారా రూ. 20 వేలు ఇవ్వాల్సి ఉండగా ఆ ఊసేత్తడం లేదు. అలాగే జలకళ పథకం కొనసాగుతుందా లేదా అనే విషయాన్ని ప్రకటించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ఐదు ఎకరాల్లోపు మెట్టపొలం కలిగిన రైతుల పొలాల్లో బోర్లు వేసి సాగునీటి వనరులను అందుబాటులోకి తెచ్చింది. కేసింగ్ పైపులతో సహా సుమారు 350 అడుగుల వరకు డ్రిల్లింగ్ చేసేలా చర్యలు తీసుకుంది. 2020లో పథకం ప్రారంభం కాగా జిల్లాలోని ఆయా మండలాల పరిధిలో 2,146 బోర్లు వేశారు. అందు కోసం కోసం రూ. 5.18 కోట్ల నిధులు వెచ్చించారు. రైతుల పొలాల్లో బోరు వేయడంతోపాటు మోటారు, విద్యుత్ సౌకర్యం కల్పించారు. బోర్లు వేసుకున్న రైతులు సాగునీరు మళ్లించుకుని ఆయా పంటల్లో అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. గడిచిన నాలుగేళ్లకాలంలో వైఎస్సార్ జలకళ పథకం మెట్ట ప్రాంత రైతులకు వరంగా మారింది. స్వతహాగా బోరు వేయించుకోవాలన్నా మోటారు, విద్యుత్ సౌకర్యంతో కలుపుకుని రూ. 3 లక్షల వరకు వెచ్చించాల్సి వచ్చేది. అంత డబ్బులతో బోరు వేయించుకోలేక మెట్ట పంటల ఆధారంగా కాలం వెల్లదీస్తూ వచ్చారు. గత ప్రభుత్వం వైఎస్సార్ జలకళ పథకం అమల్లోకి తేవడంతో రైతుల దశ తిరిగింది. ప్రభుత్వమే ఉచితంగా బోరు ఏర్పాటు చేయడంతోపాటు మోటారు, విద్యుత్ సౌకర్యం కల్పించడంతో మెట్ట ప్రాంతాలు సస్యశ్యామలమయ్యాయి. బోర్ల ద్వారా సాగునీరు అందటంతో రైతులు మెట్ట పొలాల్లో వరి, పత్తి, మిరప పంటలతో పాటు ఉద్యానవన పంటలైన నిమ్మ, చీనీ, జామ, సపోట, తదితర పంటలు సాగు చేసి ఆర్థిక బలోపేతమయ్యారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో జిల్లాలో జలకళ బోర్ల వివరాలు

క్లస్టర్	బోర్ల మంజూరు	ఇప్పటి వరకు వేసింది	వెచ్చించిన వ్యయం
ఆత్మకూరు	324	242	రూ. 4.03 లక్షలు
డోన్	1,884	1,260	రూ. 3.33 కోట్లు
కోవెలకుంట్ల	797	509	రూ. 1.28 కోట్లు
నంద్యాల	234	135	రూ.40.54 లక్షలు



జలకళ పథకం మాకు వరమైంది



నాకు 2.50 ఎకరాల సొంత పొలం ఉంది. గత ప్రభుత్వం వైఎస్సార్ జలకళ పథకం ద్వారా ఉచితంగా బోరు ఏర్పాటు చేసింది. సొంతంగా బోరు వేయించుకోవాలంటే రూ. లక్షల్లో ఖర్చు వచ్చేది. గత ప్రభుత్వం బోరు, మోటారు, విద్యుత్ కనెక్షన్‌తోపాటు సాగునీటి విడుదలకు అన్ని వసతులు కల్పించింది. నాలాంటి మెట్ట ప్రాంత రైతులకు జలకళ పథకం వరంగా మారింది. ఈ ఏడాది బోరు నీటి ఆధారంగా కంది, మినుము, తదితర పంటలు సాగు చేశాను.

– నడిపి రామిరెడ్డి, రైతు, మదనంతపురం, కొలిమిగుండ్ల మండలం

ఉచిత బోర్లు ఉన్నట్లా..లేనట్లా?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు కావస్తున్నా ఉచిత బోర్ల ఏర్పాటుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. జిల్లాలో 2.34 లక్షల మంది రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు అంతంత మాత్రంగానే కురియడంతో సీజన్ ప్రారంభమై రెండు నెలలు దాటినా లక్ష హెక్టార్లలో మాత్రమే వివిధ పంటలు సాగయ్యాయి. కుందూనది, సొంత బోర్లు, చెరువులు, తదితర సాగునీటి వనరులు అందుబాటులో ఉన్న రైతులు సాగునీటిని మళ్లించుకుని పంటలను కాపాడుకుంటున్నారు. మెట్ట ప్రాంత రైతులకు సాగునీరు అందుబాటులో లేకపోవడంతో వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. జలకళ పథకానికి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి విధి విధానాలు రూపొందించకపోవడంతో ఈ పథకం అమలవుతుందా లేదా అన్న సందిగ్ధం రైతుల్లో నెలకొంది. సొంతంగా బోరు వేసుకోవాలన్నా విద్యుత్ కనెక్షన్, మోటారు, తదితర రూపంలో రూ. 3 లక్షల వరకు వెచ్చించాల్సి ఉండిజ మెట్టపొలంలో బోరు వేసుకునేందుకు వ్యయ, ప్రయాసలు ఎదుర్కొవాల్సి ఉండటంతో ఆ దిశగా సాహసం చేయలేకపోతూ ప్రభుత్వం సాయం కోసం ఎదురు చూస్తున్నారు.



కోవెలకుంట్ల సమీపంలో జలకళ పథకం బోరు వేస్తున్న దృశ్యం (ఫైల్)

ఉచిత బోర్లు వేయించాలి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జలకళ పథకం ద్వారా మెట్ట పొలాల్లో ఉచితంగా బోర్లు వేయించింది. కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని తిరిగి అమలు చేయాలి. నాకున్న నాలుగు ఎకరాల పొలంతో పాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని గత పదిహేను సంవత్సరాల నుంచి వ్యవసాయం చేస్తున్నాను. వర్షాధారంగా మినుము, మొక్కజొన్న, శనగ, తదితర పంటలు పండించుకుంటున్నాను. జలకళ కింద బోరు వేస్తే నీటి కష్టాలు లేకుండా పంటలు బాగా పండిస్తా.

– వెంకటేశ్వర్లు, రైతు, జోళదరాశి, కోవెలకుంట్ల మండలం

రైతులను ఆదుకోవాలి



వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేసి కూటమి ప్రభుత్వం సన్న, చిన్నకారు రైతులను ఆదుకోవాలి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడిచింది. ఇప్పటి వరకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు రూ. 20 వేల పెట్టుబడిసాయం అందలేదు. అప్పులు చేసి రసాయన ఎరువులు, విత్తనాలను కొనుగోలు చేసి పంటలు సాగు చేశారు. మెట్ట పొలాల్లో బోర్లు వేసుకునేందుకు జలకళ పథకం కోసం ఎదురు చూస్తున్నారు.

– సుబ్బరాయుడు, రైతు, కోవెలకుంట్ల

మార్గదర్శకాలు విడుదల కాలేదు

జలకళ పథకం ద్వారా ఉచిత బోర్ల ఏర్పాటుకు కొత్తగా మార్గదర్శకాలు విడుదల కాలేదు. గతంలో కోవెలకుంట్ల క్లస్టర్ పరిధిలోని ఆయా మండలాల్లో 509 బోర్లు ఉచితంగా వేయించాము. ప్రభుత్వం నిర్ణయం మేరకు విధి విధానాలు వచ్చిన వెంటనే ఈ పథక అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

– సాంబశివరావు, ఏపీడీ, కోవెలకుంట్ల క్లస్టర్

విద్యకు పేదరికం అడ్డు కాకూడదు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరిస్తున్న జెడ్పీ సీఈవో, అధికారులు, పూర్వ విద్యార్థులు

- జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

వెలుగోడు: పేదరికం విద్యకు అడ్డు కాకూడదని జిల్లా పరిషత్ సీఈఓ జీ నాసరరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా విద్యార్థుల ప్రోత్సాహక సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులను దాతలు ప్రోత్సహించాలన్నారు. బీఎస్ఎన్ఎల్ డీజీఎం రాజేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే అనుకున్నది సాధించవచ్చునని సూచించారు. పూర్వ విద్యార్థుల సంఘం గౌరవ అధ్యక్షుడు గుర్రం జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత ఆశయాలు లక్ష్యంగా పట్టుదలతో చదవాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. తహసీల్దార్ శ్రీనివాస గౌడ్ మాట్లాడుతూ వెలుగోడు జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం సేవలు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి మక్బుల్ బాషా ఓసా నివేదికను వివరించారు. అనంతరం ఆ సంఘం అధ్యక్షుడు రామలింగారెడ్డి ఆధ్వర్యంలో ప్రతిభా విద్యార్థులను సన్మాంచి నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, జెడ్పీ సూపరింటెండెంట్ మురళీమోహన్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నళిని, దాతలు రవిశంకర్ అహ్మద్ హుస్సేన్, తాళ్లూరి రంగనాథ్, ఎంఈఓ బ్రహ్మయ్య ఆచారి, హెచ్ఎం సత్యనారాయణ, లిటిల్ ఏంజిల్స్ పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎం.ఎఫ్ ఇమ్మానియేల్, సర్పంచ్ వేల్పుల జైపాల్ పాల్గొన్నారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు అమలు చేయండి

గోస్పాడు: క్షేత్రస్థాయిలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు సక్రమంగా అమలు చేయాలని జిల్లా మలేరియా నియంత్రణ అధికారి డాక్టర్ కామేశ్వర రావు, డాక్టర్ ప్రోగ్రాం జిల్లా మానిటరింగ్ అధికారి డాక్టర్ జగదీష్‌చంద్రారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన గోస్పాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రస్తుతం నిర్వహిస్తున్న స్టాప్ డయేరియా, జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమ సర్వే, అనుమానిత కేసుల గుర్తింపు, తల్లి పాల వారోత్సవాలు, జాతీయ డెంగీ వ్యతిరేక మాసోత్సవంతో పాటు డ్రైడే, ఫ్రైడే వంటి కార్యక్రమాలు నిర్వహణతో పాటు ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రతి బుధ, శనివారాల్లో నిర్వహించే వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంపై గర్భిణులు, బాలింతలు, తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాలంలో దోమల వృద్ధి అధికంగా ఉంటుందని, వాటి నివారణకు అనుసరించాల్సిన విధానాలపై పలు సూచనలు చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ పారా మెడికల్ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, వైద్యాధికారులు గోవర్ధన్‌రెడ్డి, గోపాల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాలకుల పాపాలకు అధికారులే సమిధలు

- వరుసగా ప్రభుత్వ ఉద్యోగుల సస్పెన్షన్
- నెల రోజుల్లో ఎనిమిది మందిపై వేటు

సాక్షి, నంద్యాల: ప్రభుత్వ వైఫల్యాలకు అధికారులు బలవుతున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కూడా గడవక ముందే అధికారులు వరుసగా సస్పెన్షన్లకు గురవుతున్నారు. ఎన్నికల ముందు జిల్లాకు రెవెన్యూ, పోలీసు అధికారులు బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఫలితాల అనంతరం కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంతో అధికారులంతా టీడీపీ ప్రజా ప్రతినిధులను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. కొంత మంది తమను బదిలీ చేయాలని... మరికొందరు తాము ఇక్కడే విధులు నిర్వహిస్తామని ఈ మేరకు సిఫార్సు చేయాలని క్యూ కట్టడం ప్రారంభించారు. దీంతో పోస్టింగ్ ఇచ్చేందుకు ఒక రేటు ఇక్కడే ఉంచాలంటే మరో రేటు ఫిక్స్ చేయడంతో అధికారులంతా ఆ పనుల్లో తలమునకలై ఉన్నారు. ఇదే సమయంలో జిల్లాలో పలు సంచలన ఘటనలు చోటు చేసుకున్నాయి. ప్రభుత్వ వైఫల్యంతోనే ఈ దారుణాలు జరిగాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుందుకే అధికారులపై వేటు వేస్తూ ప్రజల దృష్టి మళ్లిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనలకు వెనుక, ఆ కేసులను తొక్కిపట్టేందుకు ఒత్తిడి చేయడంలో అధికార పార్టీ నేతలు ఉన్నారు. ఆ విషయాలను పక్కదారి పట్టించేందుకు ఆయా శాఖల్లో అధికారులను సమిధలు చేస్తున్నారు. నందికొట్కూరు నియోజకవర్గంలో ముచ్చుమర్రిలో చోటుచేసుకున్న బాలిక హత్య కేసు నిందితులకు అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి తండ్రి అండదండలు పుష్కలంగా ఉన్నట్లు జోరుగా ప్రచారం సాగింది. ఈ కేసు విచారణలో ఎస్ఐ స్థాయి నుంచి ఎస్పీ వరకు ప్రతి ఒక్కరూ నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు ఆరోపణలు వినిపించాయి. కాని కేవలం ఎస్ఐ జయశేఖర్, నందికొట్కూరు రూరల్ సీఐ విజయభాస్కర్‌ను బాధ్యులను చేస్తూ సస్పెండ్ చేసి ఉన్నతాధికారులు చేతులు దులిపేసుకున్నారు. అలాగే బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్‌లో పని చేస్తున్న ఎస్ఐ, ముచ్చుమర్రి పోలీసు స్టేషన్‌లో పని చేస్తున్న హెడ్‌కానిస్టేబుల్‌ను ఈ నెల 2న ఉన్నతాధికారులు సస్పెన్షన్ చేశారు. ముచ్చుమర్రిలో పని చేసి బదిలీపై వెళ్లిన ఎస్ఐ మారుతిశంకర్‌కు సీఐగా పదోన్నతి సమయంలో తప్పుడు నివేది క ఇవ్వడంతో వారిపై వేటు పడింది. రాజకీయ, ఉన్నతాధికారుల ఒత్తిళ్లకు గురై తప్పుడు నివేదిక ఇవ్వడంతో వారిపై వేటు పడినట్లు తెలుస్తోంది.

సర్కారీ హత్యలో ఇద్దరు సస్పెన్షన్

మహానంది మండలం సీతారామాపురం గ్రామంలో ఈ నెల 3వ తేదీ అర్ధరాత్రి హత్యకు గురైన పసుపులేటి సుబ్బరాయుడు ఘటనలో ఉన్నతాధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నా దీని వెనుక పాలకుల ఒత్తిళ్లు ఉన్నట్లు తెలుస్తోంది. హత్యకాండకు మూడు గంటల ముందు నుంచి గ్రామంలో జరుగుతున్న విషయాలను అప్పటికే గ్రామంలో ఉన్న ఎస్ఐ ఆ రోజు సీఐకి, డీఎస్పీకి కాల్ చేసినా స్పందించక పోవడం విమర్శలకు దారితీసింది. రాజకీయ ఒత్తిళ్లతోనే వారు స్పందించకపోవడంతోనే ఈ దారుణం జరిగినట్లుగా బాధితులు చెబుతున్నారు. అయితే ఈ ఘటనకు ఎస్ఐ నాగేంద్రప్రసాద్, సీఐ శివకుమార్‌రెడ్డి బాధ్యులను చేస్తూ సస్పెండ్ చేయడం గమనార్హం.

బాబు పర్యటనలో ఏఈఓపై వేటు

సున్నిపెంటలో 'మన నీరు- మన సంపద' కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈ నెల 1న సీఎం చంద్రబాబు శ్రీశైలం వచ్చారు. దీంతో టీడీపీ నాయకులు మద్యాన్ని ఏరులైపారించారు. దీంతో ఆలయంలో పని చేసే ఓవుట్ సోర్సింగ్ ఉద్యోగి పి. నాగేంద్ర మద్యం సేవించి భక్తులతో అమర్యాదగా ప్రవర్తించడంతో.. ఉద్యోగం నుంచి తొలగించారు. శ్రీశైలం దేవస్థానం అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ స్వాములు, క్యూలైన్ ఇన్‌చార్జ్ గంజి రవిని సస్పెన్షన్ చేశారు. టెంపుల్ ఏఈఓ హరిదాస్‌కు, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ అయ్యన్నలకు చార్జిమెమో ఇచ్చారు. టీడీపీ శ్రేణులు బలవంతంపైనే నాగేంద్ర ఆ రోజు మద్యం సేవించినట్లు సమాచారం. అధికార పార్టీ కార్యకర్తలు చేసిన నిర్వాకంతో ఇద్దరు ఉద్యోగులు సస్పెండ్ కావడం విశేషం.

లేఖ.. కాక !

- శ్రీశైల దేవస్థాన రెవెన్యూ విభాగంపై పర్యవేక్షణకు ఐదుగురితో కమిటీ
- అన్ని విభాగాలపై కమిటీలు వేయాలని రెవెన్యూ ఏఈవో వినతి
- ఏఈఓ వినతిపై క్షేత్రంలో చర్చ



శ్రీశైల ఆలయం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో పది రోజుల క్రితం ఈఓ పెద్దరాజుకు రెవెన్యూ ఏఈఓ పంపిన వినతి ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఏఈవో ఫణిధర ప్రసాద్ ఈఓకు లేఖ రాయడం ఏంటి అని, ఈఓ విచక్షణాధికారాలతో ఏ విభాగంపైన కమిటీలు వేయవచ్చునని కొందరు చర్చించుకోగా, మరి కొందరు ఒక్క రెవెన్యూ విభాగంపైనే ఎందుకు కమిటీ వేశారు.. అని చర్చించుకుంటున్నారు. ఇంకొందరు ఏఈవో రాసిన లేఖలో తప్పేంటని? అన్ని విభాగాలపై పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేస్తే పూర్తి పారదర్శకతతో పరిపాలన సాగుతుందని, తద్వారా భక్తులకు మెరుగైన సేవలు అందుతాయని భావిస్తున్నారు. ఏదేమైనా రెవెన్యూ విభాగం ఏఈవో రాసిన లేఖ క్షేత్రంలో చర్చనీయాంశంగా మారింది. శ్రీశైల దేవస్థానంలో భక్తులకు సకల సౌకర్యాలు కల్పించేందుకు దేవస్థానం వివిధ విభాగాలను ఏర్పాటు చేసింది. పరిపాలన విభాగం, ఆలయ విభాగం, అన్నదాన విభాగం, పారిశుధ్య విభాగం, రెవెన్యూ విభాగం, వసతి విభాగం, గోసంరక్షణశాల విభాగం, భద్రతా విభాగం దేవస్థానంలో ముఖ్యమైన విభాగాలు. ఆయా విభాగాలకు ఒక సహాయ కార్యనిర్వహణాధికారి, పర్యవేక్షకులు, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ ఇతర సిబ్బంది విధులు నిర్వహిస్తుంటారు. దేవస్థాన ఆయా విభాగాల ద్వారా అధికారులు, సిబ్బంది భక్తులకు సేవలందిస్తున్నారు. దేవస్థాన రెవెన్యూ విభాగం.. దేవస్థానానికి సంబంధించిన భూములు అన్యాక్రాంతం కాకుండా, అనుమతులు లేని దుకాణాలు, క్షేత్ర పరిధిలో గృహాలు ఏర్పాటు చేయకుండా పర్యవేక్షణ చేస్తారు. అలాగే శాశ్వత దుకాణాలు, తాత్కాలిక దుకాణాలు టెండరింగ్, దేవస్థానం ఉద్యోగులకు వసతి గదుల కేటాయింపు, అద్దె వసూలు చేస్తారు. అలాగే దేవస్థానంలోని తలనీలాల సమర్పణ, కొబ్బరికాయల సరఫరా, వివిధ విభాగాల్లో టెండర్ ప్రక్రియను రెవెన్యూ విభాగం చేపడుతుంది. దేవస్థానంలో రెవెన్యూ విభాగం అత్యంత కీలకమైన విభాగమని చెప్పవచ్చు.

జూలై 24న ఈఓ అలా..

దేవస్థాన రెవెన్యూ విభాగంపై పర్యవేక్షణకు జూలై 24న దేవస్థాన కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు ఐదు మందితో కమిటీని ఏర్పాటు చేశారు. దేవస్థాన సహాయ కమిషనర్, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్, పర్యవేక్షకులు, సీనియర్ అసిస్టెంట్‌లను కమిటీ సభ్యులుగా నియమించారు. దేవస్థానానికి చెందిన భూములు, తాత్కాలిక దుకాణాలు అన్యాక్రాంతం కాకుండా పర్యవేక్షిస్తూ తగు చర్యలు తీసుకోవాలని ఐదుగురితో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు.

జూలై 26న ఏఈఓ ఇలా..

దేవస్థానంలోని అన్ని విభాగాలాల్లో అక్రమా లు, అన్యాయాలు జరగకుండా కమిటీలు ఏర్పాటు చేయాలని రెవెన్యూ విభాగ ఏఈవో ఫణిధర ప్రసాద్ జూలై 26న ఈఓకి వినతి పత్రాన్ని సమర్పించారు. ముఖ్యంగా వసతి, ఆలయ విభాగం, పడితరం విభాగం, పరిపాలన విభాగం, శ్రీశైల ప్రభ, అన్నదానం, గోశాల, పారిశుద్ధ్యం, ఉద్యానవన తదితర విభాగాలపై గతంలో వచ్చిన, వస్తున్న ఫిర్యాదులను పరిశీలించి కమిటీలను ఏర్పాటు చేయాలని ఆ లేఖలో ఏఈఓ పేర్కొన్నారు.

ఇతర విభాగాల్లోనూ ఆరోపణలు..

దేవస్థాన రెవెన్యూ ఏఈవో రాసిన లేఖలో పేర్కొన్న విధంగా దేవస్థానంలోని ఇతర విభాగాలపై కూడా పలు ఆరోపణలు ఉన్నాయి. పడితరంకు సరఫరా చేసే సరుకుల్లో నాణ్యత లేదని, బహిరంగ మార్కెట్ కంటే ధరలు అధికంగా ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే టికెట్ల రీసైక్లింగ్, ఉద్యోగుల సర్వీసు రూల్స్‌కు సంబంధించి ఫిర్యాదులు, అన్నదాన విభాగంలో అన్నప్రసాద వితరణలో నాణ్యతపై పలువురు భక్తులు ఫిర్యాదులు చేశారు. అయితే ఆయా విభాగాల్లో పారదర్శకత కోసం పర్యవేక్షణ కమిటీలను నియమిస్తారో లేదో వేచిచూడాలి.

రెవెన్యూ పరిధి ఎక్కువ కావడంతోనే కమిటీ వేశాం



శ్రీశైల దేవస్థానంలో అతిపెద్ద విభాగం రెవెన్యూ విభాగం. ఇందులో తాత్కాలిక దుకాణాలు, శాశ్వత దుకాణాలు, గృహాలు, వసతి గృహాల అద్దె వసూలు, పర్యవేక్షణ, దేవస్థాన భూములు అన్యాక్రాంతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉంది. అలాగే ఈ విభాగం పరిధి, విధులు ఎక్కువ. దేవస్థానంలో ఎక్కువ మంది అధికారులు ఉన్నారు కాబట్టి వారి సర్వీసును కూడా వినియోగించుకోవాలని కమిటీ వేశాం. గతంలో దుకాణాల అద్దె వసూలు కోసం కమిటీ వేశాం. నెలన్నర లోపు సుమారు రూ.5కోట్ల మేర పాత బకాయిలు వసూలు అయ్యాయి. – డి.పెద్దిరాజు, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి

లోక్‌అదాలత్‌పై సమీక్ష

కర్నూలు(లీగల్): సెప్టెంబర్ 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌పై న్యాయ సేవా సదన్‌లో అధికారులు, న్యాయవాదులతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలావెంకటశేషాద్రి సమీక్ష నిర్వహించారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్ని కేసులు పరిష్కరించాలన్నారు.

క్లుప్తంగా

హాస్టల్ పైనుంచి దూకి విద్యార్థి ఆత్మహత్య


వీరేష్(ఫైల్)

కోడుమూరు రూరల్: హాస్టల్ భవనం పైనుంచి ఓ విద్యార్థి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం మండలంలోని అమడగుంట్ల గ్రామంలో చోటు చేసుకుంది. దేవనకొండ మండలం పి.కోట కొండకు చెందిన కమ్మరి బ్రహ్మయ్య తన కుమారులైన కమ్మరి వీరేష్ (13), మనోహర్‌లను అమడగుంట్ల బీసీ హాస్టల్లో ఉంచి స్థానిక హైస్కూల్లో 8వ తరగతి, 7వ తరగతుల్లో చేర్పించాలని నిశ్చయించుకున్నాడు. ఈ మేరకు గత రెండు రోజుల కిందటనే ఇద్దరు కుమారులను హాస్టల్ వద్దకు తీసుకొచ్చి వదిలేసి వెళ్లాడు. మంగళవారం తండ్రి బ్రహ్మయ్య ఇద్దరు కుమారులకు సంబంధించిన టీసీలు, సర్టిఫికెట్లను తీసుకుని అమడగుంట్ల హాస్టల్ వద్దకు చేరుకుని, అక్కడ కుమారులతో మాట్లాడి పాఠశాల వద్దకు వెళ్లాడు. అయితే హాస్టల్లో ఉండి చదవడం ఇష్టం లేకనో, ఇతర కారణాల వల్లనో తెలియదు కానీ తండ్రి వెళ్లిన కొద్దిసేపటికి విద్యార్థి కమ్మరి వీరేష్ హాస్టల్ భవనంపై కిందకు దూకేయగా తలకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న హాస్టల్ సిబ్బంది గాయపడ్డ వీరేష్‌ను పెంచికలపాడులోని హాస్పిటల్‌కు తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో వీరేష్ కోలుకోలేక మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కోడుమూరు ఎస్ఐ బాలనరసింహులు అమడగుంట్ల హాస్టల్ వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించడంతో పాటు, విద్యార్థి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా విద్యార్థి కమ్మరి వీరేష్‌ను అంతకుముందే కంబాలపాడు హాస్టల్లో చేర్పించగా, అక్కడ స్నేహితులెవ్వరు లేరని అమడగుంట్ల హాస్టల్లో ఉన్నారని అక్కడే చదువుకుంటానని చెప్పినట్లు తల్లిదండ్రులు రాధమ్మ, బ్రహ్మయ్యలు తెలిపారు. కుమారుల ఇష్టం మేరకే ఇద్దరినీ అమడగుంట్ల చేర్పించేందుకు వచ్చామని, ఇంతలోనే ఇంత అఘాయిత్యం జరిగిందంటూ కన్నీళ్ల పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటలక్ష్మమ్మ కోడుమూరులోని ప్రభుత్వాసుపత్రి వద్ద చేరుకుని బాలుడి మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం తల్లిదండ్రులను పరామర్శించారు.

అన్నదాత ఆశలకు 'గండి'


☛ ఈ మహిళ పేరు అల్లింబీ. వెల్దుర్తి మండలం మల్లెపల్లె గ్రామానికి చెందిన ఈమెకు .. కోడుమూరు మండలం లద్దగిరి రెవెన్యూ పరిధిలో 1.5 ఎకరాల పొలం ఉంది. కంది సాగు చేసింది. ఇప్పుడు ఆమె నిలబడిన ప్రాంతం కోతకు గురై కంది పైరు కొట్టుకుపోగా మిగిలిన కాలువను తలపిస్తున్న పొలం ఆమెది. 'ఈ కోతను మేమెలా పూడ్చుకోవాలో అర్థం కావడంలేదు. అధికారులు దయ ఉంచి మా పొలానికి మట్టి, ఇతరత్రా నష్ట పరిహారం అందించి న్యాయం చేయాలి' అని దీనంగా వేడుకుంటోంది.


గండి పూడ్చుతున్న దృశ్యం


నీట మునిగిన కల్లూరు మండలం కొంగనపాడు రెవెన్యూ పరిధి పొలాలు

- హెచ్ఎన్ఎస్ఎస్ ప్రధాన కాలువకు పడిన గండితో రైతులకు తీవ్ర నష్టం
- గండి పూడ్చేందుకు అధికారుల ముమ్మర చర్యలు
- నష్టం అంచనాలో రెవెన్యూ, వ్యవసాయ శాఖాధికారులు

వెల్దుర్తి(కృష్ణగిరి): హంద్రీ–నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) ఎత్తిపోతల పథకం ప్రధాన కాలువకు పడిన గండి రైతన్న ఆశలపై నీళ్లు చల్లింది. పైప్రాంతాల నుంచి కురిసిన వర్షాల వల్ల హంద్రీనీవాకు అధికారులు మూడు రోజుల క్రితం నీటిని విడుదల చేశారు. సోమవారం వెల్దుర్తి మండలం మల్లెపల్లె పంపింగ్ స్టేషన్(పీఎస్–3) అవతల గండి పడటంతో వందల ఎకరాలు నీట మునిగాయి. గండిని పూడ్చేందుకు అధికారులు చర్యలు ముమ్మరం చేశారు. అందులో భాగంగా సోమవారం రాత్రి పీఎస్–3 నుంచి విడుదల చేస్తున్న 6 పంపుల నీటిని నిలిపేశారు. కాలువలో నీటి పారకం అడుగుకు చేరుకున్న తరుణంలో మంగళవారం హెచ్ఎన్ఎస్ఎస్ డివిజన్–2 ఈఈ సురేశ్ కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో డీఈ హరిప్రసాద్, జేఈ హరీష్‌కుమార్ గండి పడిన ప్రాంతానికి చేరుకుని యంత్రాలతో గ్రావెల్, మట్టితో కరకట్ట నిర్మాణానికి ఉపక్రమించారు. దాదాపు 80 శాతం పనులు పూర్తి చేశామని, బుధవారానికి గండి పూర్తిగా పూడ్చివేసి, రెండ్రోజుల్లో కాలువకు నీటి సరఫరా అయ్యేలా చూస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని ఈఈ తెలిపారు. గండి పడిన ప్రాంతం నుంచి నీరు పారి దెబ్బతిన్న రైతుల పొలాల రస్తా సైతం మరమ్మతులు చేయించనున్నట్లు ఆయన తెలిపారు.

నష్టం అంచనాలో అధికారులు

కర్నూలు ఆర్డీఓ శేషిరెడ్డి, వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి, కోడుమూరు తహసీల్దార్ వెంకటేష్‌నాయక్, ఏడీఏ సాల్‌రెడ్డి, ఏఓ రవిప్రకాశ్, వెల్దుర్తి మండల సర్వేయర్ హేమంత్ రెడ్డి గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. ముంపుకు గురైన నల్లరేగడి బురద పొలాల రైతులతో మాట్లాడారు. నష్టం అంచనా వేయాలని వీఆర్‌ఓలు, వ్యవసాయ సిబ్బందికి సూచించారు. వెల్దుర్తి, కోడుమూరు, కల్లూరు మండలాల పరిధిలోని లద్దగిరి, రామాపురం, మల్లెపల్లె, కొంగనపాడు గ్రామాలకు చెందిన దాదాపు 200 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు ఆర్డీఓ, జేడీఏ తెలిపారు. ఇదే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. అలాగే గండి పడిన ప్రాంతాన్ని, నష్టం జరిగిన పొలాలను సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, రామకృష్ణ, గురుశేఖర్, నగేశ, వెల్దుర్తి రాజు తదితరులు పరిశీలించారు. రైతులతో, హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులతో, వ్యవసాయ శాఖ జేడీఏతో మాట్లాడారు. గండిని త్వరగా పూడ్చి రైతులకు నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

లక్షలు ఖర్చు పెట్టినా మా పొలం బాగు చేసుకోలేం


నాకు ఉన్న 3.5 ఎకరాల్లో ప్రొద్దుతిరుగుడు పంట వేశాను. కాలువకు గండి పడి నా పొలంలో నుంచి నీళ్లు పారి భూమి కోతకు గురై పొలం కాస్తా వంకగా మారింది. పంట నష్టం, భూమి నష్టం జరిగింది. రూ.లక్షలు ఖర్చు పెట్టినా పొలం సాగు చేసుకోవడం కష్టం. అధికారులే న్యాయం చేయాలి.

– ఎస్ నగేశ్, రామాపురం, కోడుమూరు మండలం

కోతకు గురైందన్నా పట్టించుకోవడంలేదు


కాలువకు గండి పడి కల్లూరు మండలం కొంగనపాడు రెవెన్యూ పరిధిలోని నా 4 ఎకరాలతోపాటు, మా గ్రామానికి చెందిన రైతులకు చెందిన 25 ఎకరాలు కోతకు గురైంది. తిరిగి సాగులోకి తేవాలంటే కష్టం. నష్టం అంచనాకు వచ్చిన వ్యవసాయ శాఖ, రెవెన్యూ అధికారులు సైతం పంట వేయలేదు కదా పరిహారం కోసం ఎలా రాయాలంటూ వెనుదిరిగిపోయారు. పంట వేసుకోవాల్సిన తరుణంలో భూమి కోతతో మా పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

– గోపాల్, మల్లెపల్లె, వెల్దుర్తి మండలం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల: అనంతపురం జిల్లాలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాఘవరాజుపల్లెకు చెందిన అంబటి సూర్యనారాయణ రెడ్డి (65) మృతి చెందాడు. సొంత ట్రాక్టర్‌లో నాపరాళ్లను లోడ్ చేసుకొని పామిడి వైపు డ్రైవర్ ఒంటరిగా వెళ్తుండటంతో అతనుతోడుగా వెళ్లాడు. మార్గమధ్యలో అనంతపురం జిల్లాలోని పెద్దవడుగూరు – లక్ష్మంపల్లె గ్రామాల మధ్యలో అదుపు తప్పిన ట్రాక్టర్ బోల్తా పడింది. ఇంజన్ భాగంలో కూర్చున్న సూర్యనారాయణరెడ్డిపై ట్రాలీలో ఉన్న నాపరాళ్లు మీద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య

కర్నూలు: భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపం చెంది కర్నూలు గణేష్ నగర్‌లో నివాసముంటున్న వడ్డె జయరాముడు (34) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతనికి 8 ఏళ్ల క్రితం బనగానపల్లె మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన వడ్డె భార్గవితో వివాహమయ్యింది. ఇప్పటివరకు సంతానం కలుగలేదు. ఈ విషయంలో భార్యభర్తల మధ్య తరచూ గొడవ జరిగేది. జయరాముడు భార్య భార్గవి నెల రోజుల క్రితం పీర్ల పండుగకు పుట్టింటికి వెళ్లింది. తిరిగి కాపురానికి కర్నూలుకు రమ్మని భర్త పిలిచినా రాకపోవడంతో.. జయరాముడు మనస్తాపం చెంది సోమవారం అర్ధరాత్రి ఇంట్లో చున్నీతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఆలస్యంగా గుర్తించి ఉరి నుంచి తప్పించి పరిశీలించగా అప్పటికే మృతిచెందాడు. జయరాముడు తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మూడో పట్టణ సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): 2024–25 ఏడాదికి జరగనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు 8వ తరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఏపీ మోడల్ స్కూళ్ల విద్యార్థులు అర్హులన్నారు. తమ కుటుంబ సంవత్సర ఆదాయం రూ.3,50,000 లోపు ఉన్న విద్యార్థులు వచ్చే నెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 ఎస్‌బీఐ కలెక్ట్ లింక్ ద్వారా ఫీజు చెల్లించాలన్నారు. ఈ ప్రక్రియ ఈనెల 5వ తేదీ నుంచే మొదలైందన్నారు. పూర్తి వివరాలు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

బాబు గారూ.. పింఛను ఎప్పుడిస్తారు?

- వారం రోజులుగా విశ్రాంత ఉద్యోగుల ఎదురుచూపు

కర్నూలు(అగ్రికల్చర్): కూటమి ప్రభుత్వం పెన్షనర్లను నిర్లక్ష్యం చేస్తోంది. పింఛను సొమ్ము చెల్లింపులో మీనమేషాలు లెక్కిస్తోంది. వారం రోజులు గడుస్తున్నా ఒక్కరికీ పింఛను అందకపోవడంతో లోలోపల కుమిలిపోతున్నారు. చంద్రబాబు వస్తే పింఛను సక్రమంగా ఒకటో తారీఖున వస్తుందనుకుంటే ఈయన గత టీడీపీ పాలననే గుర్తు చేస్తున్నారని మండిపడుతున్నారు. ఉమ్మడి రాష్ట్రానికి, విభజిత రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు పెన్షనర్ల పట్ల నిర్లక్ష్యం వహించారు. పెన్షనర్లకు డీఏ ఎందుకు దండగ అన్న సందర్భాలు కూడా ఉన్నాయి. మళ్లీ అదే పరిస్థితి పునరావృతం అయ్యే పరిస్థితి కనిపిస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రతి నెలా ఒకటో తేదీనే ఉద్యోగులకు వేతనాలు, పెన్షనర్లకు పెన్షన్ చెల్లించాలనేది డిమాండ్. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ఒకటో తేదీన వేతనాలు, పెన్షన్ చెల్లించడం లేదనే విషయమై ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్లు ఎన్నికల్లో ఆ పార్టీ వ్యతిరేకంగా పనిచేశారనే చర్చ కొనసాగుతోంది. అయితే వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం కొంత ఆలస్యంగా ఇచ్చిందే తప్ప ఏనాడూ ఎగ్గొట్టిన దాఖలాలు లేవు. ఇదిలాఉంటే టీడీపీ ప్రభుత్వంలోనూ జూన్ నెల వేతనం జూలై 2 నుంచి 4వ తేదీ వరకు విడతల వారిగా పడింది. పెన్షనర్లకు మరీ ఆలస్యంగా పెన్షన్ చెల్లించారు. జూలై నెల పెన్షన్ చెల్లించడంలో కూడా జాప్యం జరుగుతుండటం పట్ల ఉమ్మడి జిల్లాలోని దాదాపు 28వేల మంది పెన్షనర్లు తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు.

కక్షగట్టిన ప్రభుత్వం

ప్రతి రోజు పెన్షనర్లు బ్యాంకులకు వెళ్లి పెన్షన్ పడిందా? లేదా? అని బ్యాలెన్స్ చెక్ చేసుకుంటున్నారు. సర్వీస్‌లో ఉన్న ఉద్యోగులకు ఆయా శాఖలకు చెందిన డీడీవోలు వేతనాల బిల్లులు సీఎఫ్ఎంఎస్ ద్వారా ట్రెజరీలకు పంపుతారు. పెన్షనర్లకు మాత్రం సంబంధిత సబ్ ట్రెజరీ అధికారులే డీడీవోలుగా వ్యవహరిస్తారు. సబ్ ట్రెజరీ అధికారులు పెన్షన్ బిల్లులను గడువులోపే సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశారు. ప్రభుత్వమే ఉద్దేశపూర్వకంగా పెన్షనర్లకు పెన్షన్ చెల్లించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వారం రోజులైనా పెన్షన్ లేదు


జూలై నెలలోనూ పెన్షన్ చెల్లింపులో జాప్యం జరిగింది. కొత్త ప్రభుత్వం ఇబ్బందులు ఉంటాయిలే అనుకున్నాం. ఈ నెలలోనైనా 1వ తేదీన బ్యాంకు ఖాతాలకు పింఛను జమ అవుతుందనుకున్నాం. కానీ వారం రోజులవుతున్నా ఆ ఊసే లేదు. విశ్రాంత ఉద్యోగులకు పెన్షనే ఆధారం. ఎన్నో సమస్యలు కాచుకొని ఉంటాయి. ఇలా ఆలస్యం చేస్తుంటే మేము బతికేదెట్లా.

– వివి.శ్రీనివాసులు, ఆర్అండ్‌బి రిటైర్డ్ ఈఈ

రోజూ బ్యాంకు చుట్టూ తిరుగుతున్నాం


పెన్షన్ పడిందేమోనని ఈ నెల 1వ తేదీ నుంచి ప్రతి రోజూ బ్యాంకుకు వెళ్లి చెక్ చేసుకుంటున్నాం. నిరాశే మిగులుతోంది. టీడీపీ ప్రభుత్వం ఏర్పాటయితే ప్రతి నెలా 1వ తేదీనే పెన్షన్ వస్తుందని నమ్మాం. అయితే వారం రోజులు గడుస్తున్నా పింఛను సొమ్ము బ్యాంకు ఖాతాలకు జమ కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా ఒకటవ తేదీనే పెన్షన్ చెల్లించాలి.

– శివరామిరెడ్డి, విశ్రాంత వెటర్నరీ ఉద్యోగి

ప్రాణాలు తీసిన ఫైనాన్స్ అప్పులు


ఆంజనేయులు(ఫైల్)

కోవెలకుంట్ల: ఫైనాన్స్ అప్పులు ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకున్నాయి. కోవెలకుంట్ల ఎస్ఐ వరప్రసాద్ మంగళవారం అందించిన సమాచారం మేరకు.. కోవెలకుంట్ల పట్టణంలోని గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న ఆంజనేయులు(38) వివిధ ఫైనాన్స్ కంపెనీల నుంచి రూ.20 లక్షల దాకా అప్పులు తీసుకుని రెండు లారీలు కొనుగోలు చేశాడు. లారీలను బాడుగలకు పంపుతూ వచ్చే ఆదాయంతో భార్య దుర్గ, కుమారుడు కల్యాణ్‌ను పోషించుకుంటున్నాడు. తీసుకున్న అప్పు చెల్లించాలంటూ కొన్ని రోజుల నుంచి ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు ఒత్తిడి చేస్తున్నారు. వారి ఒత్తిడిని తట్టుకోలేక జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించే లోపే మృతి చెందాడు. మృతుని భార్య దుర్గ ఫిర్యాదు మేరకు ఆత్మహత్య కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం


పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న సెబ్ పోలీసులు

ఆలూరు రూరల్: సెబ్ పోలీసులు మంగళవారం భారీగా కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాలను స్థానిక సెబ్ కార్యాలయ ఆవరణంలో జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్ కుమార్‌తో కలిసి ఆలూరు ఇన్‌చార్జ్ సీఐ మల్లిక విలేకరులకు వెల్లడించారు. మండలంలోని కురుకుంద–కమ్మరచేడు గ్రామాల రహదారిలో తెల్లవారు జామున సెబ్ పోలీసులు వాహన తనిఖీ చేపట్టారు. బొలెరో వాహనంలో తరలిస్తున్న 54 బాక్సుల కర్ణాటక మద్యం (5,154 టెట్రా ప్యాకెట్లు 90 ఎంఎల్, 4464 లీటర్లు) గుర్తించారు. బొలెరో వాహనంతోపాటు రూ.2.2 లక్షల విలువ చేసే మద్యాన్ని సీజ్ చేశారు. డ్రైవర్ సలీంను అరెస్ట్ చేసి తమదైన శైలిలో విచారించగా హొళగుంద మండల కేంద్రానికి చెందిన దుర్గన్న ఆలూరు ప్రాంతానికి చెందిన మద్యం వ్యాపారులు హరిప్రసాద్, మురళి, శేఖర్‌లకు చేరవేసేందుకు తీసుకెళ్తున్నట్లు అంగీకరించడంతో ఐదుగురిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపా రు. నిందితుల కోసం రెండు బృందాలను ఏర్పాటు చేశామని, త్వరలో పట్టుకుంటామని ఆమె తెలిపారు. తనిఖీల్లో సెబ్ ఎస్ఐ వీరస్వామి, పోలీసు సిబ్బంది శ్రీనివాసులు, బాదుల్లా పాల్గొన్నారు.

బడి బహుదూరం

- చదువుకోవాలంటే 5 కిలోమీటర్లు నడవాల్సిందే
- నాలుగు గ్రామాల విద్యార్థులకు తప్పని నడక తిప్పలు


నేమకల్లు హైస్కూల్ నుంచి నడిచి వస్తున్న విద్యార్థులు

చిప్పగిరి: పాలకుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యం ఈ ఫొటో. భుజాన పుస్తకాల బరువుతో కాలినడకన వెళ్తున్న ఈ విద్యార్థులు రోజూ ఐదు కిలోమీటర్ల రాకపోకలు సాగిస్తున్నారు. మండలంలో 5 జెడ్పీ హైస్కూళ్లలో నేమకల్లు జెడ్పీ హైస్కూల్ ఒకటి. ఈ స్కూల్‌కు నేమకల్లుతోపాటు నగరడోణ, బెల్డోణ, సంగాల, తిమ్మాపురం తదితర గ్రామాల నుంచి విద్యార్థులు చదువుకోవడానికి వస్తున్నారు. బెల్డోణ, నగరడోణ విద్యార్థులు బస్, ఆటోలో నేమకల్లు క్రాస్ రోడ్డు వరకు చేరుకుని అక్కడి నుంచి కాలినడకన పాఠశాలకు చేరుకుంటున్నారు. మిగతా సంగాల, తిమ్మాపురం గ్రామాల నుంచి ఎలాంటి బస్, ఆటో సౌకర్యం లేకపోవడంతో దాదాపు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న నేమకల్లు పాఠశాలకు నడిచి పోవాల్సిన పరిస్థితి. తమ తమ సొంత గ్రామాల్లో ప్రాథమిక విద్యను పూర్తి చేసుకుని హైస్కూల్‌కు వెళ్లాలంటే మాత్రం ఇలా నడక తప్పని సరి అని విద్యార్థులు వాపోతున్నారు.

వెంకటాపురం పోస్టాఫీసులో గోల్‌మాల్

- రూ. 4 లక్షల నిధులు స్వాహా
- పోస్టుమాస్టర్ భర్తే సూత్రధారి


గ్రామ ప్రజలను విచారిస్తున్న పోస్టల్ శాఖ అధికారులు

డోన్ టౌన్: పేదల కష్టార్జితాన్ని పోస్టల్ అధికారులు కాజేశారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా వెంకటాపురం గ్రామంలో కొందరు పేదలు ఆర్డీలు, గ్రామీణ తపాల బీమా, సేవింగ్ ఖాతాల రూపంలో దాచుకున్న డబ్బును దోచేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వెంకటాపురం పోస్టాఫీసు పరిధిలో నాలుగు గ్రామాలు ఉన్నాయి. ఆ గ్రామాల ప్రజలు ఈ పోస్టాఫీసులో పొదుపు చేస్తున్నారు. ఆ సొమ్మును పోస్టల్ అధికారులు కుమ్మక్కై స్వాహా చేసినట్లు వెలుగులోకి వచ్చింది. ఖాతాదారుల పుస్తకాల్లో నమోదు చేయకుండా కొంత, వసూలు చేసిన సొమ్మును పోస్టల్ శాఖకు జమ చేయకుండా మరి కొంత కాజేసినట్లు తెలుస్తోంది. దాదాపు రూ. 4 లక్షలు స్వాహా చేసినట్లు అధికారుల విచారణలో తేలింది. నిధుల స్వాహా ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో కర్నూలు జిల్లా అడిషనల్ సూపరింటెండెంట్ విజయ్‌మోహన్ ఆధ్వర్యంలో వారం రోజులుగా గ్రామంలో విచారణ జరుగుతోంది. అధికారికంగా రూ.2లక్షల వరకు ఇన్‌చార్జ్ పోస్ట్‌మాస్టర్‌గా వ్యవహరించిన శ్రీనివాసులు వాడుకున్నట్లు అధికారులు లెక్కలు తేల్చారు. అనధికారికంగా మరో రూ. 2 లక్షలు కూడా కాజేసినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా ఏఎస్పీ విజయ్‌మోహన్ మాట్లాడుతూ వెంకటాపురం బ్రాంచ్ రెగ్యులర్ పోస్టుమాస్టర్ మయూరి ప్రసూతి సెలవులపై వెళ్లడంతో ఆమె స్థానంలో ఇన్‌చార్జ్ బాధ్యతలు తీసుకున్న ఆమె భర్త శ్రీనివాసులు అక్రమాలకు పాల్పడినట్లు తెలిసిందన్నారు. ఇందులో ప్రతి మూడు నెలలకు తనిఖీలు చేసే మెయిల్ ఓవర్‌సీర్ అధికారి నిర్లక్ష్యంపై ప్రజలు ప్రశ్నించగా అధికారులు దాట వేశారు. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.




డ్రైవర్‌ను రక్షిస్తున్న పోలీసులు, స్థానికులు, తీవ్రంగా గాయపడి క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్ మనోహరన్

నరకయాతన

- ఆగి ఉన్న లారీని ఢీకొన్న కంటైనర్
- క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్
- రెండు గంటల పాటు శ్రమించి బయటకు తీసిన పోలీసులు

చాగలమర్రి: రెండు వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో కంటైనర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ రెండు గంటల పాటు నరకయాతన అనుభవించాడు. ఈ ఘటన నంద్యాల – చిత్తూరు జాతీయ రహదారిపై పెద్దబోధనం సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆళ్లగడ్డ వైపు నుంచి చెన్నైకి వెళ్తున్న లారీ పెద్ద బోధనం సమీపంలో టైరు పంక్చర్ కావడంతో రోడ్డు పక్కన నిలిపారు. అదే మార్గంలో వస్తున్న కంటైనర్ వాహనం నిలిచి ఉన్న లారీని వెనుక వైపు నుంచి వేగంగా ఢీకొంది. దీంతో కంటైనర్ డ్రైవర్ మనోహరన్ తీవ్రంగా గాయపడి క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న చాగలమర్రి ఎస్ఐ రమణయ్య సిబ్బందితో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. పోలీసులు, టోల్‌ప్లాజా సిబ్బంది రెండు గంటల పాటు శ్రమించి గడార్లతో క్యాబిన్‌ను పగులగొట్టి డ్రైవర్‌ను బయటకు తీశారు. కాలికి తీవ్ర గాయమై రక్త స్రావం అవుతున్న అతడిని చికిత్స నిమిత్తం 108లో ఆళ్లగడ్డ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సుప్రీం తీర్పుతో మాలలకు తీవ్ర అన్యాయం


కలెక్టరేట్ ఎదుట మాల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన

కర్నూలు(సెంట్రల్): ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చి తీర్పుతో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని మాల జేఏసీ చైర్మన్ యాట ఓబులేష్ అన్నారు. మంగళవారం ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ అంబేద్కర్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు మాల సంఘాల జేఏసీ పెద్ద ఎత్తున ర్యాలీని నిర్వహించింది. కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా జేఏసీ చైర్మన్ మాట్లాడుతూ మాలలకు అన్యాయం చేస్తే ప్రభుత్వాలను కూల్చుతామని హెచ్చరించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ప్రకారం పార్లమెంట్, రాష్ట్రపతి ఆమోదం లేకుండా ఎస్సీ వర్గీకరణను ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. వర్గీకరణతో దళితులందరికీ అన్యాయం జరుగతుందన్నారు. రాజకీయ నాయకుల కుర్చీలు పెకిలించే సత్తా మాలలకు ఉందని, ఆ విషయాన్ని కొన్ని పార్టీలు గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మాల సంఘాల నాయకులు చంద్రమౌళి జ్యోతి, మునయ్య, మాధవస్వామి, మాదాసు నాగరాజు, వెంకటేష్, రాజీవి, కుందా వెంకటేష్, సామెల్,నవీన్, నాగేష్, గిడ్డయ్య పాల్గొన్నారు.

ఆకతాయిలకు జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): మహానందిలో ఈశ్వర్‌నగర్ కాలనీకి చెందిన ఆకతాయిలకు జైలు శిక్ష విధిస్తూ మంగళవారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి తీర్పు ఇచ్చినట్లు మహానంది పోలీసులు తెలిపారు. ఈశ్వర్‌నగర్ కాలనీలో సుధీర్, రమేష్, సురేష్‌కుమార్, చిన్నబాబు, ఆంజనేయులు ఈలలు వేస్తూ, సైగలు చేస్తూ మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించేవారు. స్థానికుల ఫిర్యాదుతో వారిని అరెస్ట్ చేసి, కోర్టులో హాజరు పరచగా ఒక్కొక్కరికి 10 రోజుల చొప్పున జైలు శిక్షను ఖరారు చేసినట్లు మహానంది పోలీసులు తెలిపారు.

యథేచ్ఛగా గుడుంబా విక్రయాలు

పాణ్యం: మండల పరిధిలోని గోనవరం గ్రామంలో నాటుసారా పట్టపగలే గుభాలిస్తోంది. ఏకంగా ప్రభుత్వ పాఠశాల ఎదురుగా ఉన్న మారెమ్మ గుడి వద్ద నాటుసారాను విక్రయిస్తున్నారు. మంగళవారం సాయంత్రం విక్రయదారులు యథేచ్ఛగా నాటుసారాను విక్రయిస్తుండటంతో చూసిన చుట్టుపక్కల వాళ్లు, అటుగా వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక నాటుసారా విక్రయాలు ఊపందుకున్నాయని, అధికారులు కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.